సాక్షి కామారెడ్డి
శుక్రవారం, 20, సెప్టెంబర్, 2024



అద్దె భవనాల్లో..
దోమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సగానికిపైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు.
- 10లో ▸



గల్ఫ్ బాటలో..
ఉన్న ఊళ్లో ఉపాధి దొరక్క గల్ఫ్ బాట పట్టాలనుకుంటున్న వారిని ఏజెంట్లు మోసం చేస్తున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.8 /20.3
ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఇద్దరు సీఐల బదిలీ

బాన్సువాడ : బాన్సువాడ టౌన్, రూరల్ సీఐలు గురువారం బదిలీ అయ్యారు. టౌన్ ఎస్‌హెచ్‌వోగా పని చేసిన మున్నూరు కృష్ణ, రూరల్ సీఐగా పని చేసిన సత్యనారాయణను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్‌వోగా నిర్మల్ డీఎస్‌బీలో పని చేస్తున్న అశోక్‌ను నియమించగా, బాన్సువాడ రూరల్ సీఐగా ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్న సాజిదుల్లాను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బాన్సువాడకు బదిలీపై వచ్చిన ఇద్దరు సీఐలు ఒకేసారి బదిలీ కావడంపై బాన్సువాడలో చర్చ జరుగుతోంది.

రిటెయినింగ్ వాల్ మరమ్మతుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): వర్షాల కారణంగా కొట్టుకుపోయిన సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ తాత్కాలిక మరమ్మతు పనులను క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ దత్తాద్రి గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతో రిటెయినింగ్ వాల్ మరమ్మతులకు రూ.8.4 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో టెండర్ ప్రక్రియ ద్వారా తాత్కాలికంగా మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఆయన వెంట నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, క్వాలిటీ ఏఈ అవినాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ తదితరులున్నారు.

2 నుంచి దసరా సెలవులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది. వచ్చేనెల 2 నుంచి 14వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 15న స్కూళ్లు పునఃప్రారంభమవుతాయి. జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు.

ఆలయానికి రూ.4లక్షల విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని హిందూ సేన హనుమాన్ ఆలయ పునరుద్ధరణ కోసం హైకోర్టు న్యాయవాది మహమ్మద్ మోహిన్ హమ్మద్ ఖాద్రీ రూ.4 లక్షలు విరాళం ప్రకటించారు. 150 మంది నిర్వాహకులు రూ.వెయ్యి చొప్పున జమ చేసి వినాయక ఉత్సవాలు నిర్వహించి చివరి రోజు లక్కీ డ్రా తీశారు. తులం బంగారం, 10 లడ్డులు డ్రా తీశారు. న్యాయవాది ఖాద్రీకి లక్కీడ్రాలో తులం బంగారం దక్కింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ఖాద్రీ రూ. 4లక్షల విరాళం ప్రకటించారు. వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శంకర్‌గౌడ్, గౌరి ప్రకాశ్, ప్రదీప్, ప్రసాద్, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

గో విజ్ఞానంపై వీహెచ్‌పీ పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్ : ఆవులతో మానవళికి అనేక ప్రయోజనాలున్నాయని విశ్వహిందూ పరిషత్ గోసేవ విభాగ్ ప్రముఖ్ రాజేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్‌లో గోమాత వైభవం, గోవిజ్ఞాన పరీక్షలు చేతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. గో సంతతిపై భూసారం, వ్యవసాయం, పాడి పంటలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టత ఎలా ఆధారం పడిందనేది 6వతరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు తెలియజెప్పేందుకు పుస్తకాన్ని రూపొందించినట్లు గోసేవ ప్రముఖ్ రాజేశ్వర్ తెలిపారు. పుస్తకంలోని 30 ప్రశ్నలకు జవాబులు రాసిన వారికి వీహెచ్‌పీ గోసేవక్ విభాగం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పుస్తకాలు కావాల్సిన వారు 96406 31553 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గోసేవక్ కన్వీనర్ చిదుర శివకుమార్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, నగర ప్రముఖ్ కన్కంటి రాజు, శిశుమందిర్ ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

నాగన్న బావికి పూర్వవైభవం!

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన నాగన్నగారి మెట్ల బావి.. పూర్వవైభవం సంతరించుకుంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థల రెండున్నరేళ్ల శ్రమతో పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంది. పనులు పూర్తి కావస్తుండడంతో పర్యాటకుల సందర్శనార్థం అనుమతించనున్నారు. శుక్రవారం ఈ బావిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

'సాక్షి' కథనంతో కదలిక

- పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక
- చొరవ చూపిన నాటి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- రెయిన్ వాటర్ ప్రాజెక్టు, సహీ ఎన్జీవోల సహకారంతో అభివృద్ధి
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రారంభోత్సవానికి సిద్ధమైన మెట్లబావి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/లింగంపేట : లింగంపేట మండల కేంద్రంలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారికి సమీపంలో మెట్ల బావి ఉంది. దీనిని నాగన్నగారి బావిగా పిలుస్తారు. ఈ మెట్ల బావి కళా నైపుణ్యం అబ్బురపరుస్తుంది. బావి అడుగు నుంచి పైభాగం వరకు అందమైన శిలలతో నిర్మించారు. పైనుంచి అడుగు భాగం వరకు బావికి నలువైపులా మెట్లున్నాయి. ప్రధాన మార్గాన్ని పడమర దిశలో ఏర్పాటు చేశారు. ఉపరితలం నుంచి 20 అడుగులకు ఒక అంతస్తు చొప్పున ఐదు అంతస్తులు అంటే దాదాపు వంద అడుగుల లోతు ఈ బావిని నిర్మించారు. బావిలోని శిలలపై శంఖుచక్రాలు, పుష్పాలు... ఇలా రకరకాల శిల్పాలు చెక్కించారు. బావికి నలువైపులా సుందర దృశ్యాలున్నాయి. బావి పైభాగంలో చిన్నచిన్న కంకర రాళ్ల, డంగు సున్నంతో పైకప్పు వేశారు. తూర్పు భాగంలో బావి నుంచి నీటిని పైకి చేదడానికి మోటబావి లాంటి నిర్మాణం ఉంది. ఇక్కడి నుంచి నీటిని కాలువ ద్వారా తరలించి పంటలకు చేరేలా ఏర్పాట్లు ఉన్నట్టు తెలుస్తోంది. దీనిని 18 వ శతాబ్దంలో నిర్మించినట్టు కొందరు పేర్కొంటున్నారు. సంస్థానాదీశుల పరిపాలన కొనసాగిన కాలంలో ఈ కట్టడం నిర్మితమైందని తెలుస్తోంది. అయితే ఏ సంస్థానాదీశులు నిర్మించారన్న దానిపై సరైన ఆధారాలు లభించడం లేదు. జక్సాని నాగన్న అనే వ్యక్తి ఈ దిగుడు బావిని నిర్మించారని, అందుకే దీనిని నాగన్నగారి బావి అంటారని గ్రామస్తులు చెబుతారు.

టూరిజం సర్క్యూట్‌గా మార్చితే..

రెండేళ్ల క్రితం వరకు మురికి కూపంగా ఉన్న నాగన్నగారి మెట్ల బావి.. ఇప్పుడు చూడముచ్చటగా మారింది. బావి చుట్టూ ఇనుప జాలీ ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతంలో పచ్చదనం పెంపొందించే పనులు చేపట్టారు. పూడిక తీసి మరమ్మతులు చేపట్టడంతో అప్పటి అద్భుతమైన నిర్మాణ శైలి వెలుగులోకి వచ్చింది. జిల్లాలో ఇప్పటికే భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం వద్ద ఉన్న బావిని తీర్చిదిద్దారు. లింగంపేట నాగన్నగారి బావితో కలిపి రెండు బావులు పర్యాటకులను ఆకర్షించనున్నాయి. అలాగే ఎల్లారెడ్డి, రాజంపేట, శెట్పల్లి సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో మెట్ల బావులు ఉన్నాయి. వాటిని కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు, పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం, కౌలాస్ కోట, దోమకొండ గడీకోట.. ఇలా జిల్లాలోని పురాతన కట్టడాలతో పాటు ఆలయాలను కలిపి టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శతబ్దాల చరిత్ర ఉన్నా..

శతాబ్దాల చరిత్ర ఉన్న నాగన్నగారి మెట్ల బావిని పట్టించుకునే వారు లేకపోవడంతో పూడిక పేరుకుపోయింది. పాలకుల ఆదరణ లేక అద్భుతమైన కట్టడం మరుగున పడిపోయింది. ఈ విషయమై 'సాక్షి' 2022 జనవరి 29న 'మెట్ల బావిలో నిర్లక్ష్యపు పూడిక' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీనిపై అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందించారు. నాగన్నగారి బావికి పునర్వైభవం కోసం ఆయన చేయని ప్రయత్నమంటూ లేదు. ఆయన గ్రామస్తులతో కలిసి ముళ్ల పొదలు, చెట్లను తొలగించడంలో భాగస్వామి అయ్యారు. పూడిక తొలగించే పనిలోనూ శ్రమదానం చేశారు. రెయిన్ వాటర్ ప్రాజెక్టు అనే స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ కల్పనా రమేశ్‌తో మాట్లాడి వారి సహకారంతో దానికి పూర్వ వైభవం తీసుకువచ్చారు. ప్రస్తుత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కూడా నాగన్న బావిని పలుమార్లు సందర్శించి, కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పర్యాటక కేంద్రంగా తయారు చేశారు. నాగన్నగారి బావికి పునర్వైభవం తీసుకురావడానికి రెయిన్ వాటర్ ప్రాజెక్టు, సహీ ఎన్జీవోలు కలిసి దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేశాయి. అందంగా, అద్భుతంగా తయారైన బావిని శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో కలిసి ప్రారంభించనున్నారు.

మెట్ల బావి పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నాగన్నగారి మెట్ల బావిని గురువారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బావి ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ల బావి శిథిలావస్థకు చేరుకోవడంతో గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ తీసుకుని పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చేయించారన్నారు. శుక్రవారం మెట్లబావిని ప్రారంభించి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, పీఆర్ డీఈ గిరి, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి ఉన్నారు.



మెట్ల బావిలో
నిర్లక్ష్యపు పూడిక

'సాక్షి' కథనం క్లిప్పింగ్

బియ్యం లేదా నగదు చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- సీఎంఆర్ తిరిగివ్వని రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

కామారెడ్డి క్రైం : జిల్లాలో 2021-22, 2022-23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని తీసుకుని సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) తిరిగి ఇవ్వని రైస్ మిల్లర్లు బియ్యం లేదా నగదును ఈనెలనె 27వ తేదీ లోగా తిరిగి ఇవ్వాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం డిఫాల్ట్ రైస్ మిలర్లు, అధికారులతో సీఎంఆర్ పెండింగ్ బకాయిలపై సమావేశం నిర్వహించారు. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు 27వ తేదీ లోగా బియ్యం లేదా నగదును ఇవ్వకపోతే ఆ తరువాత వడ్డీతో సహా నగదు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని వారిపై ఆర్‌ఆర్ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు. డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ధరణి ఫైళ్లను తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి

కామారెడ్డి క్రైం : ధరణి పెండింగ్ ఫైళ్లను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ధరణి, ఓటరు సర్వే, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్ కార్యాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటి ఓటరు సర్వే ఈనెల 26వ తేదీ లోగా 100 శాతం పూర్తి చేయాలని, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి నుంచి జిల్లాకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దని, నాలుగు రోజుల్లో 100 శాతం పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా అధికారులు దృష్టి సారించాలని, ఒక వేళ ఆక్రమణకు గురైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సివిల్ సప్లయీస్ అధికారులతో సీఎంఆర్‌పై సమీక్షించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, పర్యవేక్షకులు సుమలత, స్వప్న, సరళ, ఇందిరా ప్రియదర్శిని, తహసీల్దార్లు, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్స్ ఏదైనా ఫ్లెక్సీ పెట్టుడే..

- మున్సిపాలిటీల్లో నిబంధనలు బేఖాతర్
- బల్దియాల ఆదాయానికి గండి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సందర్భమేదైనా ఆయా పట్టణాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత తోరణాలు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. నయా పైసా మున్సిపాలిటీలకు చెల్లించకుండా ఫ్లెక్సీలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ, వ్యాపార, వ్యక్తిగత ఫ్లెక్సీలను ఇష్టమున్న చోట్ల ఏర్పాటు చేస్తున్నా కట్టడి చేయడంలో మున్సిపల్ అధికారులు, పాలకులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకునేలా గతంలోనే సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఫ్లెక్సీల ఏర్పాటుపై అధికారులు గతంలో చర్యలు తీసుకున్న సందర్భాలున్నప్పటికీ ప్రస్తుతం పట్టించుకోవడం లేదు.

నిబంధనల ప్రకారం రోడ్డు పక్కన ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతి లేదు. టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతి తీసుకోవడమే కాకుండా నిబంధనల ప్రకారం నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి తీసుకుని ఆ తర్వాత ఏర్పాటు చేసుకోవాలి. పండుగలు, శుభకార్యాలు, కార్యక్రమాలు, రాజకీయ ప్రచార సమయాల్లో రహదారులు, కూడళ్ల పక్కన, అంతర్గత వీధుల్లోని స్తంభాలకు ఫ్లెక్సీలను అనుమతులు లేకుండానే ఏర్పాటు చేస్తూ బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు. ఫ్లెక్సీల ఏర్పాటు కారణం ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. ఫిర్యాదు వస్తే తప్ప వాటిని తొలగించడం లేదు. జరిమానాల రూపంలో బల్దియాలకు రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణాల్లో సెంట్రల్ డివైడర్లు, పెద్ద హోర్డింగ్‌ల ఏర్పాటు కోసం మాత్రమే టెండర్లు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, రైల్వే బ్రిడ్జి, మున్సిపాలిటీ ముందు, కొత్తబస్టాండ్, సీఎస్ఐ చర్చి ముందు చౌరస్తాలో, పాత జాతీయ రహదారికి ఇరువైపులా, రైల్వే గేట్, పాత బస్టాండ్, హౌజింగ్‌బోర్డు, నిజాంసాగర్‌రోడ్డు, టేక్రియాల్, నర్సన్నపల్లి వద్ద పట్టణంలోని ప్రవేశించే ప్రాంతాల్లో జోరుగా ఫ్లెక్సీలు కడుతున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నాయి.

చూసీచూడనట్లుగా..

పట్టణాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు విపరీతంగా పెరిగాయి. దుకాణాల ముందు, రోడ్ల మీద ఇష్టారీతిన సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పట్టణ ప్రణాళిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారిస్తే మున్సిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరనుంది.

అనుమతులు తీసుకోవాలి

మున్సిపాలిటీ అనుమతులు తీసుకుని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవాలి. డివైడర్ల మధ్య, హోర్డింగ్‌లకు టెండర్ ద్వారా ఇచ్చారు. అనమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తాం. ఫిర్యాదు వచ్చిన చోట్ల వెంటనే తొలగిస్తున్నాం.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి

గ్రామాల్లో అంగన్‌వాడీల పాత్ర కీలకం



చిన్నారులకు బాలామృతం తినిపిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : గ్రామాల్లో అంగన్‌వాడీల పాత్ర కీలకమని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మీనా గార్డెన్‌లో పోషణ్ అభియాన్‌లో భాగంగా ఇంటింటా పోషణ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పోచారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమన్నారు. గ్రామంలో ఉండే ప్రతి ఒక్కరి పూర్తి వివరాలు అంగన్‌వాడీ టీచర్ల వద్దనే ఉంటాయన్నారు. చిన్నారికి బాలామృతం తినిపించారు. గర్భిణులకు సీమంతం చేశారు. అంతకుముందు అంగన్‌వాడీ ప్రతిజ్ఞను చదివి వినిపించారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో సౌభాగ్యలక్ష్మి, వాణి, నాయకులు అంజిరెడ్డి, ఖాలేక్, మోహన్‌నాయక్ తదితరులున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ గజానాన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు దేవారం, దేగాం యాదాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే వేలాదిమంది రైతులు ఒక్కటై ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గంగారాం, రాజన్న, గంగారెడ్డి, రాములు, సురేష్, విజయ్, అంకాపూర్ గంగారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన



ఎల్లారెడ్డి : కౌమార దశలో కలిగే మార్పుల గురించి విద్యార్థులకు ఐసీటీసీ కౌన్సిలర్ గోపాల్ గురువారం అవగాహన కల్పించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు కౌమారదశలో శరీరంలో మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రైమరీ స్కూల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ నివేదికను అమలు చేసి నూతన పీఆర్సీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షుడు శ్రీహరి, నాయకులు తదితరులున్నారు.

ఎన్‌సీసీకి 58 విద్యార్థుల ఎంపిక



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఎన్‌సీసీ ర్యాలీ నిర్వహించి 58 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఆకుల సుధాకర్ తెలిపారు. ఎంపిక కోసం నిర్వహించిన పరుగు పోటీకి వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ 12వ బెటాలియన్ ఆర్మీ అధికారులు హరిప్రీత్‌సింగ్, గుర్జిత్‌సింగ్, అధ్యాపకుడు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాటలో ఆగమైన బతుకులు

పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన పల్లికొండ స్వామి హెయిర్ కటింగ్ సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఒక రోజు ఓ మధ్యవర్తి ద్వారా మలేషియా వెళ్ళాలని ఏజెంట్ ను ఆశ్రయించాడు. సదరు ఏజెంట్ కు రూ 60వేలు చెల్లించాడు. డబ్బులు చెల్లించిన కొద్ది రోజులకు చెన్నై నుంచి మలేషియా చేరుకున్న స్వామికి కష్టాలు మొదలయ్యాయి. అక్కడికి వెళ్ళిన తర్వాత వెట్టి చాకిరి చేయించుకొని జీతం అడిగిన పాపానికి చిత్ర హింసలకు గురి చేయగా నడుం ఎముక విరిగింది. ఎలాగోలా ఇల్లు చేరిన స్వామి నడుంకు ఆపరేషన్ చేయించుకున్నాడు.

మండలంలోని అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన అజ్మీరా శ్రీనివాస్ ఇటీవల దుబాయ్ వెళ్లాలని మధ్యవర్తి ద్వారా ఢిల్లీలో ఉన్న ఏజెంట్ ను కలిసి రూ.3 లక్షలు ముట్టజెప్పాడు. అంతేకాకుండా ఊరికి వచ్చి మరో 8 మందిని తీసుకెళ్లి డబ్బులు కట్టించాడు. అందరు కలిసి ఢిల్లీ వెళ్లారు. అక్కడి హోటల్లో ఒక వ్యక్తి వద్ద వారి పాస్ పోర్టులు పెట్టి సదరు ఏజెంట్ చెక్కేశాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించారు.

అక్కాపూర్ గ్రామానికి చెందిన గంధం మహేశ్ మలేషియా వెళ్లాలని మధ్యవర్తి ద్వారా ఏజెంట్ కు రూ. 1.20 లక్షలకు రూ. 45 వేలు చెల్లించాడు. చెన్నై నుంచి మలేషియా వెళ్లాలని ఏజెంట్ నమ్మించడంతో చెన్నై వెళ్లిన మహేశ్ మోసపోయానని తెలుసుకొని ఇల్లు చేరి పోలీసులను ఆశ్రయించాడు.



- ఏజెంట్ల మోసంతో దగా పడ్డ వైనం
- న్యాయం కోసం ఠాణా మెట్లెక్కుతున్న బాధితులు

మాచారెడ్డి : ఉన్న ఊళ్లో ఉపాధి లేక బతుకుదెరువు కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లాలనుకుంటున్న వారి ఆశలను ఏజెంట్లు సొమ్ము చేసుకుంటున్నారు. డబ్బులు దండుకుని సరైన ఉపాధి చూపకుండా మోసాలకు పాల్పడుతున్నారు. మోసపోయిన వారు న్యాయం కోసం అటు రాజకీయ నాయకులు, ఇటు పోలీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

అప్పులు తీర్చలేక..

అప్పులు చేసి కిందామీదా పడి గల్ఫ్ దేశాలకు వెళితే అడ్డగోలు మిత్తీలు తీర్చలేక భార్యా,పిల్లల్ని వదిలి ఏళ్ల తరబడి ఎడారి దేశాల్లో మగ్గుతున్నారు. అప్పులిచ్చిన వాళ్లు ఇచ్చిన డబ్బులతో పాటు కానుకలు డిమాండ్ చేస్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తాము గల్ఫ్ దేశాలకు వెళ్లింది తమ కోసం కాదని, అప్పులిచ్చిన వారి కోసమేనని నిట్టూర్చారు. ఇంకా ఎన్నో గుండెల్ని పిండేసే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

వారు వెళ్లేటప్పుడు ఊహ తెలియని పిల్లలు కొన్నేళ్ల తర్వాత ఇల్లు చేరిన తండ్రిని గుర్తు పట్టలేని హృదయ విదారక సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైన ప్రజాపాలన ప్రభుత్వం గల్ఫ్ బాధితుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని గల్ఫ్ బాధితులు కోరుతున్నారు.

గుడ్డిగా నమ్మొద్దు



బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలు వెళ్లే వాళ్లు ఏజెంట్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు.నమ్మకమైన వ్యక్తుల ద్వారానే ఏజెంట్లను సంప్రదించాలి.గల్ఫ్ బాటలో మోసపోయిన వాళ్లు పోలీసులను సంప్రదించాలి.

– అనిల్, ఎస్సై మాచారెడ్డి

సంక్షిప్తం

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సన్మానం చేశారు. టీపీసీసీ ప్రెసిడెంట్ ఎన్నిక సమయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విదేశీ పర్యటనలో ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్ : ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యమిత్రలు 16 ఏళ్లుగా ఆరోగ్య సేవలు చేస్తూ అరకొర వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు.

మేధాశక్తికి అనుగుణంగా బోధించాలి



నిజాంసాగర్(జుక్కల్): తరగతి గదుల్లో విద్యార్థుల మేధాశక్తికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని మహమ్మద్ నగర్ మండల విద్యాశాఖ నోడల్ అధికారి అమర్‌సింగ్ సూచించారు. గురువారం మహమ్మద్ నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. హెచ్ఎం సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

కల్కి భక్తుల అన్నదానం

కామారెడ్డి అర్బన్ : స్వర్ణయుగ శ్రీ పరంజ్యోతి కల్కి భగవతి భగవాన్ దేవాలయం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్‌లో 400 మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బాలు, గంపప్రసాద్, సిద్దంశెట్టి శ్రీనివాస్, దోమకొండ శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, మామిడి రాకేష్, గంగాధర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

బాన్సువాడ : హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ఓ హోటల్‌లో కుళ్లిన ఆహార పదార్థాలు పెడుతున్నారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆ ఆ హోటల్‌లో భోజనాన్ని పరిశీలించారు. హోటల్‌లో కుళ్లిన పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హోటల్‌లో పనిచేసే సిబ్బందికి హెయిర్ క్యాప్‌లు, హ్యాండ్‌గ్లౌస్‌లు ఉండాలన్నారు. మున్సిపల్ సిబ్బంది హన్మాండ్లు, సతీష్, రోహిత్ తదితరులున్నారు.



నేటి నుంచి బాలాజీ జెండా ఉత్సవాలు

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో గురువారం రాత్రి తిరుమల తిరుపతి శ్రీ బాలాజీ జెండా కొలువుదీరింది. పాత బస్టాండ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయం ఎదుట గ్రామస్తులు, జెండా కమిటీ సభ్యులు బాలాజీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. ప్రతి ఏడాది గణేశ్ నిమజ్జన అనంతరం తిరుమల జెండా వస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. 11 రోజుల పాటు పూజలందుకున్న జెండా తిరుపతికి చేరుకుంటుందన్నారు.

జాబితాపై అభ్యంతరాలు తెలపాలి



నాగిరెడ్డిపేటలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు



లింగంపేటలో..

ముసాయిదా ఓటరుజాబితాపై జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించారు. జాబితాలో సవరణలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులు సిబ్బందికి సూచించారు.



నాగిరెడ్డిపేటలో ..



తాడ్వాయిలో..



భిక్కనూరులో..



మాచారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో..

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

కామారెడ్డి క్రైం/రామారెడ్డి/బీబీపేట/భిక్కనూరు/లింగంపేట : జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులను గురువారం పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ప్రజాభవన్ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గాంధారిలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రెడ్డిరాజు, బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు దుర్గం శివాజీ తదితరులును అరెస్ట్ చేశారు. రామారెడ్డిలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులను అరెస్ట్ చేశారు. బీబీపేటలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్‌ను తదితరులను, భిక్కనూరులో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ సాయిరెడ్డి తదితరులను, లింగంపేటలో మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, పట్టణాధ్యక్షుడు సాయిరాం తదితరులను అరెస్ట్ చేశారు.



పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

డిగ్రీ కళాశాల భూములు కాపాడాలి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించి భూములను కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థల నిర్మాణాలు చేపడుతున్నారని తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ టీవీఎస్ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్‌కుమార్, ముదాం అరుణ్, వినయ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సెల్ టవర్ ఎక్కిన జీపీ కార్మికుడు



బీబీపేట: మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థిక సమస్యలు నెలకొంటున్నాయని వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓ జీపీ కార్మికుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన కొమ్మురాజు జీపీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని గురువారం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న జీపీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి జీతాల మంజూరుకు కృషి చేస్తామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో నీట మునిగి నలుగురి మృతి



బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన చిన్న మల్రెన్న(32) బుధవారం ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. గురువారం కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా మండల శివారులోని శ్మశాన వాటిక వద్ద మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు మెండోరా ఎస్సై నారాయణ పేర్కొన్నారు.

కోటగిరి శివారులో..

రుద్రూర్: కోటగిరి శివారులోని కాలువలో ప్రమాదవశాత్తు ఒకరు పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పాత బాన్సువాడకు చెందిన సాయిరాం(40) భార్య విజయ మధ్య గొడవలు జరగడంతో కోటగిరి మండలం ఎత్తొండలో ఉన్న తల్లిగారింటికివచ్చింది. దీంతో సాయిరాం బుధవారం ఎత్తొండకు వస్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కానీ గురువారం ఉదయం కోటగిరి శివారులోని కాలువలో మృతదేహమై కనిపించాడు. మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొతంగల్ చెరువులో..

పొతంగల్: మండల కేంద్రంలోని చెరువులో గురువారం మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు పొతంగల్ చెందిన గూండ్ల సాయవ్వ(43)గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిన సాయవ్వ తిరిగి రాలేదు. సాయవ్వకు మతిస్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువలో.

నిజాంసాగర్: మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో నాలుగు రోజుల క్రితం కొట్టుకు పోయిన గుర్తుతెలియని మహిళ మృతదేహం గురువారం మహమ్మద్‌నగర్ మండలంలోని ముగ్దంపూర్ శివారు కాలువలో లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి ఒంటిపై నీలి రంగు చీర, పసుపు రంగు జాకెట్ ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

నాసిరకం పాలకోవా తిని అస్వస్థత

- శాంపిల్స్ సేకరించిన బల్దియా సిబ్బంది



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఓ వ్యక్తి బండిపై కొనుగోలు చేసి పాలకోవాను తన కుమారుడికి తినిపించాడు. పాలకోవా తిన్న ఆ బాలుడు అస్వస్థకు గురయ్యాడు. వెంటనే తండ్రితో పాటు చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. పాలకోవా విక్రయించిన వ్యక్తిని పట్టుకొని బల్దియా సిబ్బందికి అప్పగించారు. పాలకోవాను నాసిరకమైన పదార్థాలతో తయారు చేసినట్లు బాలుడి తండ్రి అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు పాలకోవా బండిని మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. ఫుడ్‌సేఫ్టీ సిబ్బంది శాంపుల్స్ సేకరించారు. పాలకోవాను కర్నూలు జిల్లాలో తయారు చేసి రెండు రోజులకు ఒకసారి అక్కడి నుంచి జిల్లాకు తీసుకు వస్తున్నారని తెలిసింది. ఆ పదార్థం జిల్లా కేంద్రంలో రోడ్డు వెంట తిరుగుతూ విక్రయిస్తున్నట్లు తెలిసింది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు

బాల్కొండ: రోడ్డు డివైడర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ముప్కాల్ మండల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బొల్లి సన్నీ(19) అతని స్నేహితులు అన్నెపాక గోపి, చెన్నూర్ అరవింద్ కలిసి ఒకే బైక్‌పై జాతీయ రహదారి పక్కన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తుండగా లక్ష్మి కాలువ వంతెన వద్ద రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో సన్నీ, గోపీలకు తీవ్ర గాయాలు కాగా అరవింద్‌కు నడుము భాగంలో బలమైన గాయమైంది. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సన్నీ తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బొల్లి సన్నీ (ఫైల్)

ప్రాణం తీసిన వాటర్ హీటర్

నిజాంసాగర్(జుక్కల్): స్విచ్ ఆన్‌లో ఉన్న వాటర్ హీటర్‌ను చేతితో పట్టుకున్న ఓ వ్యక్తి కరెంట్‌షాక్‌తో మృతి చెందిన ఘటన మహమ్మద్‌నగర్ మండలం తుంకిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిలు(53) హైదరాబాద్‌కు వెళ్లేందుకు గురువారం ఉదయం 4 గంటలకు లేచాడు. వేడినీటి స్నానం కోసం బకెట్‌లో వాటర్‌ను నింపి హీటర్ ఆన్ చేశాడు. దానిని ఆఫ్ చేసే క్రమంలో వేరే బటన్‌ను ఆఫ్ చేసి హీటర్‌ను పట్టుకోవడంతో కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



రౌతు సాయిలు (ఫైల్)

నగరంలో కత్తిపోట్లు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో వినాయక శోభాయాత్రను చూసేందుకు వెళ్లిన అన్నదమ్ముళ్లపై జరిగిన కత్తిపోట్లు కలకలం రేపింది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్య కాలనీకి చెందిన అజయ్, అర్వింద్ ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరు బుధవారం తెల్లవారుజామున అదే ప్రాంతంలోని ఓ గణేశ్ శోభాయాత్రను అందరితో కలిసి రోడ్డుపై వీక్షిస్తుండగా సదరు మండప నిర్వాహకులు శోభాయాత్రలో పాల్గొన్న వారిని అడ్డుకున్నారు. దీంతో తాగిన మైకంలో ఉన్న నలుగురు యువకులు తమను ఎందుకు అడ్డుకున్నావంటు అజయ్‌పై చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న అర్వింద్ మా అన్నను ఎందుకు కొడుతున్నారంటు వారిని అడ్డుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో వారు అర్వింద్‌ను కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే అర్వింద్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాంఘిక బహిష్కరణపై ఫిర్యాదు

కామారెడ్డి టౌన్/ కామారెడ్డి అర్బన్: కులాంతర వివాహం చేసుకున్న ఓ జంట బంధువుల అంత్యక్రియలకు హాజరైతే సాంఘిక బహిష్కరణ చేసిన ఘటన తాడ్వాయిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో ఎస్పీ సింధూశర్మకు గురువారం ఫిర్యాదు చేశారు. తాడ్వాయికి చెందిన అక్షయ, అనిల్ ఐదు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. ఇటీవల అనిల్ మేనమామ మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరైన వీరిని కుర్మ కులస్తులు వీరిని అడ్డుకుని దూషించారు. అనంతరం సాంఘిక బహిష్కరణ చేశారు. ఈ విషయమై స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. విచారణ చేపట్టిన తగు న్యాయం చేయాలని నాయకులు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాగయ్య, జిల్లా అధ్యక్షుడు సాయన్న, నాయకులు నాగభూషణం, రాజన్న, శివ ఉన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్ తనపై కొందరు దాడిచేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన జక్కుల రాజేశ్ అనే వ్యక్తి పెద్దమల్లారెడ్డి శివారులో ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈనెల 17న కొండల్‌రెడ్డి అనే వ్యక్తి ఫామ్‌హౌస్ గేట్ ఎదుట కారును నిలిపాడు. కారును తీయాలని వాచ్‌మన్ రాజేశ్ కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొండల్‌రెడ్డి కొంతమందికి ఫోన్‌చేసి అక్కడికి రప్పించి తనపై దాడికి పాల్పడ్డారని అన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఎడపల్లి: మండలంలోని పోచారం గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెటి పూజిత(35) ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటోంది. పూజిత భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కుటుంబీకులు సైతం ఎవరూ లేరు. పూజిత గురువారం ఉదయం తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య తీరుపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళకు పరిచయం ఉన్న వ్యక్తులే హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీపై కేసు

బాన్సువాడ: రైస్‌మిల్లు నుంచి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ధాన్యం లారీపై బీర్కూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. డోంగ్లి మండలం కుర్ల రైస్‌మిల్లు నుంచి ధాన్యాన్ని అక్రమంగా బీర్కూర్ మీదుగా తరలిస్తుండగా గమనించిన బీర్కూర్ వాసులు లారీని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు లారీని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశారు. లారీలో 295 క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు గుర్తించారు. గత రబీలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కుర్ల రైస్ మిల్‌కు పంపించారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా రైస్ మిల్లు యజమాని ఇతర ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత రబీలో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం, నిజాంసాగర్, పలు మండలాల్లో ఉన్న రైస్‌మిల్లులకు తరలించిన విషయం తెలిసిందే. కానీ రైస్ మిల్లుల యజమానులు ధాన్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారు.

చోరీ కేసులో ఆధారాల సేకరణ


మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో చోరీ జరిగిన కేసులో క్లూస్‌టీం అధికారులు గురువారం వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. బుధవారం కళావతి ఇంట్లో రెండు తులాల బంగారు నెక్లెస్, సెల్‌ఫోన్ చోరీకి గురైన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. క్లూస్‌టీంను రప్పించారు. అలాగే గ్రామంలో సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

ప్రేమ విఫలం.. యువకుడి బలవన్మరణం

నిజామాబాద్ రూరల్: ప్రేమ విఫలమైందని ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పీఎస్ పరిధిలోని ఖానాపూర్ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటో డివిజన్ ఖానాపూర్‌కు చెందిన గౌతమ్ (28) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా అదే ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించడంతో ఆమె ప్రేమను నిరాకరించింది. దీనికి తోడు గౌతమ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఖానాపూర్ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఫిలిప్పీన్స్‌లో రోడ్డు ప్రమాదం

- వేల్పూర్‌కు చెందిన వైద్య విద్యార్థి మృతి



నీరడి అక్షయ్(ఫైల్)

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నీరడి అక్షయ్(23) అనే వైద్య విద్యార్థి ఫిలిప్పీన్స్ దేశంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీరడి అక్షయ్(23) ఫిలిప్పీన్స్ దేశంలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఈనెల 15న కాలేజీ నుంచి తాను నివసించే ఇంటికి మోపెడ్‌పై వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించాడు. అక్షయ్ తండ్రి నీరడి రాజన్న వరంగల్ మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వారి కుటుంబం సుమారు ఇరవై ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడింది. మరో ఆరు నెలల్లో అక్షయ్ ఎంబీబీఎస్ పూర్తయ్యేదని, అంతలోనే ఇలా జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. అక్షయ్ మృతదేహం శనివారం హైదరాబాద్‌కు చేరే అవకాశం ఉందని తెలిపారు.